# ప్రణవము పరమాత్మునికి పర్యాయపదము

**విశ్వహృదయమందు వినిపించు ప్రణవంబు**
**వినుడు శ్రద్ధతోడ వీనులలర**
**కామ్యముక్తులనిడ కల్పకంబిదెసుమ్మ**
**మరువబోకు డిట్టి మంచిమాట.**

ప్రేమస్వరూపులారా!

'వేదానాంసామవేదోస్మి'. వేదములయందు సామవేదము నేనే అని గీతాచార్యుడు ప్రకటించాడు. 'సామ్నాఉద్గీతోరసః', అన్నది ఛాందోగ్యఉపనిషత్తు. సామవేదమునందు రసస్వరూపమై, ప్రేమస్వరూపమై, దివ్యస్వరూపమై ప్రకటితమవుతున్నది యీ సామవేదము. ఉద్గీతమనగా ప్రణవమే! సామవేదమునకు ప్రణవమే రసము. ప్రణవమే ప్రాణము.

**ప్రణవస్వరూపమైనదే సామవేదము**

'ఓంకారం సర్వవేదానాం'. సర్వవేదములయందు ఓంకారము ప్రధానమైనదనే అంశము ప్రకటితం చేయబడింది. దీనినిబట్టి ఓంకారమనేది యెంత ఉత్కృష్టమైనది, ఎంత పవిత్రమైనది, ఎంత ప్రధానమైనది మనం అర్థం చేసుకోవాలి. అక్షర ప్రపంచమందు ఏకాక్షరమైన ఓంకారమే సర్వాక్షరములను నిరూపింపచేస్తున్నది. ప్రణవము పరమాత్మునికి పర్యాయపదము. ఇట్టి ప్రణవస్వరూపమైనదే సామవేదము. సామవేదమును వ్యాసుడు జైమినీ మహర్షికి మొదట బోధించాడు. అతడు తన శిష్యులకు, ఆ శిష్యులు తమ శిష్యులకు యీ విధమైన శిష్యపరంపరగా అభివృద్ధిగాంచి యిది అనేక శాఖలుగా రూపొందింది. సహస్రశాఖలుగా వెలసిన యీ సామవేదము కాలగర్భములో కలసిపోయి కడకు మూడు శాఖలు మాత్రమే నిలచివున్నాయి. 'కౌధిమ' అనేది ఒక శాఖ, 'రాణాయని' అనేది

sri sathyasai vachanamrutam

రెండవశాఖ, 'జైమిని' అనేది మూడవశాఖ. ఈ 'కౌథిమ' అనే శాఖ గుజరాత్‌లో నాగర బ్రాహ్మణులయందు నేటికి నిలచి వుంటున్నది. 'రాణాయని' అనే శాఖ మహరాష్ట్రమునందు యిమిడి వుంటున్నది. ఇంక మిగిలినది 'జైమిని' శాఖ ఇది కర్ణాటక రాజ్యములో ప్రచారములో నున్నది. అయితే, కౌథిమ, రాణాయని యీరెండు శాఖలలోపల యెక్కువ భేదములు కన్పించవు. 'హ', 'ఉరా', 'ని' అని కౌథిమ శాఖ వల్లిస్తే. రాణాయని శాఖ 'ఆ ఆ ఊ రా నీ...'అని అన్నింటికిని దీర్ఘమునిస్తూ వస్తుంది. దీర్ఘములతోకూడినది రాణాయని. కొన్నింటికి మాత్రమే దీర్ఘమునిచ్చి మరికొన్నింటిని స్వల్పముగా పలికేది కౌథిమ. ఇది చిన్నశాఖయే అయినప్పటికి ప్రధానమైనది. ఇది రెండువిధములుగా వుంటున్నది. అర్చని, గానము అని రెండు విధములు. ఈ గానములలోపల నాలుగు విధములుంటున్నవి. గ్రామీణగానము, అరణ్యగానము అనగా అరణ్యమునందు గానముచేసేది, మూడవది ఊహాగానము, నాల్గవది ఊహ్యగానము.

పూర్వకాలము పల్లెలయందు నిత్యజీవితములో పర్వదినములయందేకాక మిగిలిన దినములయందుకూడను అనగా పంటలయందు, కోలాటములయందు, గొబ్బెళ్లయందు, కలుపులయందు, కోతలయందు యీగానములను పాడుతూ ఆనందాన్ని అనుభవించేవారు. అరణ్యములో పశువులను మేపుకుంటూ నిర్భయముగా కంఠమునెత్తి పాడుకుంటూ కాలమును ఆనందముగా అనుభవిస్తూవచ్చేవారు. ఇదియే అరణ్యగానము. ఈ అరణ్యములయందు కేవలము సహజమైన శబ్దమునే శృతిగా భావించుకొని, చెట్లు, రాళ్ళునుండి వచ్చే ధ్వనినే ఒక తాళముగా విశ్వసించుకొని స్వేచ్ఛగా భగవంతుని కీర్తిస్తూ గానములను చేసేవారు. ఇక, నాల్గవది ఊహాగానము. దీనికి నేటి సినిమా గానములు ఒక చక్కని ఉదాహరణ. సినిమాలో ఒకవ్యక్తి యేడుస్తూ వుండినట్టుగా వూహించి యీ యేడుపు పాటలలోపల యక్ యక్...అన్నట్టుగా కొన్నియేడుపు ధ్వనులు ప్రకటింపచేస్తూంటారు. నిజముగా యేడుపులేదు. ఆ సన్నివేశములో ఆ వ్యక్తి ఏడుస్తున్నట్లుగా కల్పించి ఏడ్పు విన్పించే రీతిగా చేయటము. అదే విధంగా నవ్వినట్లుగా వూహించి, కృత్రిమమైన నవ్వును తెరమీద ప్రకటితంచేసేది. ఉద్రేకించినట్లుగా వూహించి, ఆ వుద్రేకము పరులపైన ప్రకటింపచేసేది. నిజముగా ఆ వ్యక్తికి ఏడుపుగాని, ఉద్రేకముగాని, నవ్వుగాని లేదు. ఇవన్నీ



srisathyasai vahanamrutam

కేవలము ఊహాగానములే! ఊహాగానమనగా తాను ఒక సన్నివేశమును అనుభవించి, దానిలో తాదాత్మ్యభావమును పొంది, తద్వారా యితరులకుకూడను ఆ భావములు పంచిపెట్టే గానములు. ఈ విధంగా నాల్గువిధములైన గానములను సామవేదము ప్రపంచమునకందించింది.

**'ఓం, బ్రహ్మ, ఆత్మ' యీ మూడుకూడను అభేదములే!**

వీటన్నింటికి ప్రధానమైనది ప్రణవము. ప్రణవములేని స్థానము లేదు. ప్రణవము వినని కాలము లేదు. ఒక్క క్షణమైనను మనము ప్రణవమును విడచి వుండలేము. ప్రతి జీవియొక్క గళమునందుకూడను ప్రణవమే వుంటున్నది. సర్వత్రా వున్న ప్రణవమే మూలము. అట్టి ప్రణవస్వరూపమే బ్రహ్మమని నిరూపించింది. కనుక దీనినే 'యేకాక్షరంబ్రహ్మ' అన్నారు. ఆ యేకాక్షరం 'ఓం'. అదే 'ఏకాక్షరంబ్రహ్మ'. ఆ ఒక్క అక్షరమే బ్రహ్మస్వరూపమన్నాది. ఏతావాతా 'ఓం' అనేది 'బ్రహ్మ'మనేది పర్యాయపదములే కాని, రెండును ఒక్కటే. అవి అభేదమైనవి. ఓం యెట్లు సర్వవ్యాపితమైనదో, సర్వత్రానిండివున్నదో, అదే విధముగనే బ్రహ్మకూడను సర్వత్రానిండి, సర్వవ్యాపకుడై వుంటున్నాడనే సత్యాన్ని మనం గుర్తించాలి. ఇది యీవిధముగానుండగా 'ఆయమాత్మబ్రహ్మ' అనే మరొక వాక్యము వచ్చింది. ఈ ఆత్మ అనేదికూడను బ్రహ్మస్వరూపమే! కనుక 'ఓం, బ్రహ్మ, ఆత్మ', యీమూడుకూడను అభేదస్వరూపములే!

**జగత్తంతయు భగవంతుని విశ్వరూపమే!**

ప్రతి మానవుడు నిత్యజీవితములోపల నాల్గు అవస్థలు అనుభవిస్తూ వస్తున్నాడు. అవి స్వప్న, జాగ్రత్, సుషుప్తి, తురీయములు. జాగ్రత్ అనగా దృశ్యకల్పితమైన యీజగత్తంతయు పంచభూతములతో, పంచప్రాణములతో, పంచేంద్రియములు మరియు అంతఃకరణములైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములు కలసి 19 ముఖములతోకూడి వుంటున్నాది. దీనికి ఐదుకోశములుకూడా కూర్చారు. ఈ ఇరవైనాల్గు తత్వములతోకూడినదే యీ దృశ్యకల్పితమైన ప్రపంచము. జాగ్రదవస్థయందు స్థూలముగా దృశ్యస్వరూపమై వుంటున్నది. ఆత్మలేక యీజగత్తుకాని, స్థూలముగాని అనుభవించుటకు

srisathyasaivachanamrutam

వీలుకాదు. కనుకనే యీ ఆత్మకు 'విష్ణుడు' అని పేరు పెట్టారు. ఇంతియేకాక సర్వులయొక్క వుదరమునందుకూడను అన్ని పదార్థములను జీర్ణము గావించే, అగ్నిహోత్రునిగా నిలచిన వైశ్వానరునకుకూడను 'ఆత్మ' అని పేరుపెట్టారు. అనగా అనేక రూపనామములతోకూడినదే యీ విరాట్‌స్వరూపము. కృష్ణుడు అర్జునునకు విరాట్‌స్వరూపం చూపినాడంటే యేమిటి? సర్వత్రా సర్వకాలములయందు సర్వస్థితులయందు తాను యీ రూపాన్ని ధరించి వున్నాడనే సత్యాన్ని నిరూపించటమే! ప్రపంచమంతయుకూడను భగవంతునియొక్క విశ్వరూపమే! దీనినే విరాటుడు అని కూడను పిలుస్తూవచ్చారు. విరాట్‌స్వరూపమునందు ఆత్మ జాగ్రదవస్థలో స్థూలరూపమును ధరించివుంటున్నది. అదియే స్వప్నావస్థయందు సూక్ష్మరూపమును ధరించివుంటున్నది. జాగ్రదవస్థయందు యింద్రియములతో కూడిన యీ యొక్క ఆత్మ అంతర్ముఖముగా నిలచి తనకు తానే సంకల్పించుకొని ఏకోహం బహుస్యాం అన్నట్లుగా తనకు తాను సంకల్పించుకొని అనేక రూపములను, అనేక స్థితులను అనుభవించినట్లుగా నిరూపిస్తుంది.

ఈ స్వప్నమునందు రూపముగాని రూపములు, శబ్దముగాని శబ్దములు తిండిగాని తిండి యిలాంటివి సృష్టించుకుంటూ వున్నాది. పరిమితముగాకూడ వుంటున్నాది. ఈ సృష్టి ఆ స్వప్నావస్థకు మాత్రమే పరిమితముకాని తిరిగి మరొక అవస్థకు పరిమితంకాదు. తిరిగి వ్యాపించదు. తనకు తానే సర్వమునూ సృష్టించుకుని తనకు తానే భీతిని, ఆనందాన్ని అనేక విధములైన కష్టములను, నష్టములను, సుఖములను, దుఃఖములను అనుభవిస్తూ వుంటుండాది. ఈ అన్నింటికిని ఆత్మయే కారణము. ఒక గదిలోపల పదిమంది పరుండినారంటే, పదిమందికి పది విధములైన స్వప్నములు రావచ్చునే కాని ఒకరి స్వప్నమునకు, మరొకరి స్వప్నమునకు యేమాత్రము సంబంధముండదు. అనగా తనయొక్క భావములచేత తాను సంకల్పించుకొని ఒక పరిమితమైన అవస్థను అనుభవిస్తూవుంటాడు, స్వప్నావస్థయందు. వీటి అన్నిటికి మూలాధారము ఒక వెలుగు వుంటున్నాది. ఆ వెలుగునకే 'తేజస్సు' అన్నారు. తేజస్వరూపుడైన ఆత్మకే 'తైజసుడు' అని పేరు పెట్టారు. స్వప్నావస్థయందు తైజ స్వరూపకంగా వుంటున్నది, ఆత్మ.

ఒక చిన్న ఉదాహరణము. మనము స్వప్నమువరకు పోనక్కరలేదు. మీరు కన్నులు గట్టిగా మూసుకొని యేమిచూస్తున్నామని విచారణచేస్తే యేమీ కన్పించటంలేదు. అంతా చీకటిగా కన్పిస్తున్నది, అంటాము. అయితే యీ చీకటిని చూస్తున్నది యెవరు. ఎవరూ అక్కడ చూడకుండిన యిది చీకటి అని యెట్లు నిర్ణయించగలము? కనుక, కన్నులు మూసుకొన్నప్పటికిని ఎవరో ఒకరు అక్కడ చూస్తూవుండటచేతనే ‘చీకటిగా వున్నది, నల్లగా వుంటున్నది’ అని చెప్పగలుగుతున్నారు. ఆ నలుపును చూసేవారు ఎవరో ఒకరున్నారు, ఆ చీకటిని చూచేవారెవరో ఒకరున్నారు. అతనే తేజస్వరూపుడు. తైజసరూపములో స్వప్నావస్థలో వుండినవాడే అంతఃకరణయందు సూక్ష్మరూపమును ధరించివుంటున్నాడు.

**ఆత్మ సుషుప్తిలో ప్రజ్ఞాస్వరూపుడు కనుక ‘ప్రజ్ఞానం బ్రహ్మ’ అని తెలుపబడింది**

ఇంకమూడవది సుషుప్తి. అనగా మంచి నిద్ర. ఇక్కడ జాగ్రతగానీ, స్వప్నముగానీ యేమాత్రములేవు. ఇందులో కల్పనగాని, సృష్టిగాని యేమాత్రము కన్పించవు. సర్వేంద్రియములుకూడను మనసులో లీనమైపోయినవి. ఇక్కడ కేవలం ప్రజ్ఞ మాత్రమే నిలచివుంటుంది. ఈ ప్రజ్ఞచేతనే తన వునికిని గుర్తిస్తూవుంటాడు. ఆనందమును అనుభవిస్తూ వుంటుంటాడు. సర్వేంద్రియములుకూడను స్తంభించి వుంటుంటాయి. ఉచ్ఛ్వాసనిశ్వాసముల లోపల ప్రజ్ఞాపాత్రుడైన పరమాత్ముడు అనుభవిస్తూంటాడు. ప్రజ్ఞస్వరూపుడే బ్రహ్మ కనుక ‘ప్రజ్ఞానం బ్రహ్మ’ అని తెలుపుతూ వచ్చింది. ఈ యొక్క ప్రజ్ఞనే నిరంతరము వుండిన తెలివితేటలు లేక శాశ్వతమైన ఆనందము అని దీనిని నిరూపిస్తూ వచ్చారు. ఈ ప్రజ్ఞయే జాగ్రదవస్థలో శరీరమునందును ఇంద్రియములతోకూడిన అంతఃకరణయందును, ఆత్మయందును సమముగావుండటంచేత దీనికి Constant Integrated Awareness అన్నారు. ఈ ప్రజ్ఞస్వరూపుడుగా వుండటంచేత అతనికి ‘ప్రాజ్ఞుడు’ అని పేరు పెట్టారు. కనుక, ప్రాజ్ఞుడు అనేది కేవలం బ్రహ్మస్వరూపమే! అదే ఆత్మస్వరూపము. ఈ బ్రహ్మస్వరూపంగాని, ఆత్మస్వరూపంగాని గోచరంకావటంలేదే అని మనము సందేహించవచ్చును. అక్కడకూడను ప్రణవస్వరూపమనేది వుండటంచేత యీ బ్రహ్మ, ఆత్మస్వరూపములు అభిన్నముగా వుంటున్నాయి. ప్రణవము యేరీతిగా మనకు

sri sathyasaivachanamrutam

కనిపిస్తున్నాది, వినిపిస్తున్నాది? ప్రణవము కన్పించేదికాదు. భక్తిని తినిపించేది. ఓంకారము వినిపించేది. కన్పించే జగత్తుగాని, విన్పించే శబ్దముగాని, అనిపించే మాటలుకాని, అనుభవింపచేసే హృదయముగాని యివన్నియు యీప్రణవములోనే లీనమై వుంటున్నవి. ఉచ్ఛ్వాసనిశ్వాస స్వరూపుడైనవాడే ఓంకారస్వరూపుడు. కనుక, ఓంకారమనేది యీ బ్రహ్మస్వరూపాన్ని, ఆత్మస్వరూపాన్ని ప్రకటితం గావిస్తున్నది. సృష్టిఅంతయు ఓంకారముతోనే నిండివున్నది. సుషుప్తియందుకూడను ప్రాజ్ఞస్వరూపుడై వుండటంచేత యిందులో ఆత్మ సాక్షాత్కరించినట్లుగా నిరూపిస్తూవున్నది.

నాల్గవది తురీయము. తురీయావస్థ అనగా నాల్గవస్థానమని అర్థము. ఇదియేమిటి, యేవిధమైన స్వరూపముతో వుండివుంటుంది? ఇది సర్వమును లీనము గావించుకొని కేవలము పూర్ణానందాన్ని అనుభవిస్తుంటాది. ఆనందస్వరూపమును ధరించి వుంటుంది. అద్వైతానందముతోకూడి వుంటుంది. వర్ణనాతీతమైన స్థితిలో వుంటుంది. అనగా జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయములు ఆత్మకు నాల్గు పాదములవంటివి. అకార, ఉకార, మకార యింకా తురీయావస్థలోవున్నది, అధిరతము. అధిరతమనగా యేమిటి? అకార, ఉకార, మకారములుకూడిన తక్షణమే యేర్పడు ధ్వనికే 'అధిరత' అంటారు. అకారమనేది ఓంకారమునకు మొదటి ధ్వని. ఈ శబ్దప్రపంచమునకు అది మూలాధారము. శబ్దతరంగములలోపల అది ప్రధానమైనది. ఇది అన్ని అక్షరములకు మొదటిస్థానమున ఉండినది. ఇది జాగ్రదవస్థతోకూడిన విరాటస్వరూపుడుగా విశ్వసింపబడుతున్నది. ఈ విరాట్స్వరూపుడే విష్ణువుగా రూపొందుతుంది. జాగ్రత్ ప్రపంచమునకు అకారము మూలాధారము. ఇది విరాట్ స్వరూపునియొక్క సన్నిహిత సంబంధము. ఇంక స్వప్నావస్థయందు వున్న ఉకారము. ఈ 'ఉ' కారము అనేది ఓంకారములో రెండవధ్వని. ఈ ఉకారత్వమనేది తేజస్వరూపాన్ని ధరించి వుంటుంది. సర్వస్వమును ప్రకటింపచేస్తుంది. దీనికి అంధకారమనేదే లేదు. 'మ' కారము మూడవ అక్షరము. ఇది సూత్రస్థానమును ప్రకటిస్తుంది. సర్వులయందును వున్న అంతర్భావమును ప్రకటింపచేస్తుంది, సూత్రప్రాయుడని దీనికి మరొకపేరు. అనగాయేమిటి? సూత్రములయందు దారము చేరినట్లు ప్రతి జీవునియందు యీ మకారమనే సూత్రము సర్వత్రా చేరివుంటున్నాది.

అందువలననే యితనికి సూత్రాత్మకుడను మరొక పేరు. ఇతనికి రూపములేదు. అలాంటి తత్త్వాన్ని నిరూపిస్తుంది యీ మకారము. ఆ అకార, ఉకార, మకారములు చేరిన తరువాత ఒక ధ్వని వినిపిస్తుంది. ఇది తురీయావస్థకు సంబంధించినది. ఇదియే ఓంకారము.

## ప్రణవనాదమును చక్కగా అర్థము చేసుకున్నవారే తత్త్వజ్ఞానులు కాగలరు

కనుక అకార, ఉకార, మకారములతోకూడిన ఓంకారమునకు నాల్గుపాదములు. ఆత్మకు, బ్రహ్మకు, యీ ఓంకారమునకు నాల్గుపాదములున్నవి. కనుక 'చతుర్ముఖుడు, బ్రహ్మ' అని నిరూపిస్తూ వచ్చింది. దానినే శబ్దబ్రహ్మమనికూడను పేర్కొనడం జరుగుతుంది. శబ్దబ్రహ్మమునందే గానబ్రహ్మ లీనమైవుంటుంది. యీ శబ్దబ్రహ్మము ఒకదానిలో నిలచినది కాదు, సర్వత్రా వ్యాపించినది. 'శబ్దబ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి' అని అష్టసంబంధమైన శక్తులు కల్గినటువంటిది. ఇలాంటి ఓంకార తత్త్వమును ప్రతి హృదయమునందు ప్రతిష్ఠింపచేసుకుని తాను, తనవాక్కు, తనదృష్టి, సర్వము ప్రణవనాదమే అనే సత్యాన్ని గుర్తించినపుడే మనము ఈ సామవేదమును గుర్తించిన వారమౌతాము. సామవేదములోని యీ ప్రణవనాదమును చక్కగా అర్థము చేసుకున్న వ్యక్తులు మాత్రమే తత్త్వజ్ఞానులు కాగలరు. ఇందున్న తత్త్వాన్ని గుర్తించుకొనక యేదో బాహ్యమైన సాధనలచేత మనము యీ తత్త్వజ్ఞానాన్ని పొందలేము.

**ఇంట జ్యోతి వెలుగుచునుండ**
**పొరుగుయింటి కగ్గికరుగనేల?**

ఇక్కడే జగత్ స్వరూపుడైన ప్రణవ స్వరూపుడు వుండగా, బాహ్యసంబంధమైన ఆచారములుగాని, విచారములుగాని, సాధనములుగాని యెందుకు? 'ఇట్టి సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడు అయిన భగవంతుడు శబ్దస్వరూపుడై నాయందు వుంటున్నాడు ప్రణవాకారముతో', అనే విశ్వాసమును మనము పెంచుకోవాలి. ప్రణవమును అపవిత్రము గావించకుండావుండే నిమిత్తమై అధిక శబ్దముచేత, అధిక



sri sathyasaivahanamrutam

మాటలచేత ప్రణవాకారశక్తిని వ్యర్థము గావించరాదని చెప్పడం జరిగింది. ఈ ప్రపంచములో మనము ఏది చూచినప్పటికి, విన్నప్పటికి, చెప్పినప్పటికి, ప్రణవాకారమే! కనుకనే చెడ్డ చూడరాదు, వినరాదు, మాట్లాడరాదు. ఇదే మూడు కోతుల కథ. వీటిలో ఒకటి చెవులు మూసుకొని వుంటుంది. ఒకటి కన్నులు మూసుకొని వుంటుంది. ఒకటి నోరు మూసుకొని వుంటుంది. కోతులే యిట్టి మంచి విషయములు అనేక విధములుగా బోధనలు చేస్తున్నాయి. అతిగా మాట్లాడవద్దు, ప్రణవనాదాన్ని వ్యర్థము గావించవద్దు. శ్రావ్యమైన శబ్దములు వినగల్గిన మన చెవులు అపశబ్దమును వినటానికి యేమాత్రము అంగీకరింపవద్దని చెవులు మూసుకుంటాయి. పరదూషణగాని, పరులను హేళన చేయటముగాని, పరులను హాస్యాస్పదముగా చూచే పలుకులు కాని మన నోటినుండి రారాదు. మన energyని అంటే అదే దైవశక్తిని మనము వ్యర్థము గావించిన వారమవుతాము. ప్రణవస్వరూపమైన భగవచ్ఛక్తిని వ్యర్థము గావించినప్పుడు, మన జన్మము సార్థకమెట్లవుతుంది?

అదే విధముగనే చెడు వినటంగాని, పలుకటంగాని, చూడటంగాని మంచిది కాదు. ఇవియే నిత్యజీవితములో మనము అభివృద్ధిపరచుకోవాలి. అనవసరమైన విషయములలో ప్రవేశించరాదు. ఈ సత్యాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇలాంటి తత్వమును, నిత్యజీవితములోపల సాధనకు అనుగుణ్యమైన మార్గములను ప్రబోధిస్తూ వచ్చింది, సామవేదము.

అన్ని వేదములయందు యీ సామవేదము ఉత్కృష్టముగా భావింపబడుతూవచ్చింది. కనుకనే అట్టి 'సామవేద స్వరూపుడను నేను' అని కృష్ణపరమాత్ముడు 'వేదానాం సామవేదోస్మి' అని ఉద్ఘాటించాడు. అనగా నేను సామవేదమును, వేదములలో ప్రధానమైన స్థానమును వహించినానని గీతాచార్యునియొక్క వాక్యము. దివ్యత్వాన్ని, పవిత్రాన్ని ప్రకటితంగావించి, ప్రచారంసల్పి, ప్రబోధలు చేసి ఆనందాన్ని అందించేది, యీ సామవేదము.

**వేద మంత్రములు వల్లించినంత మాత్రమున ప్రయోజనము లేదు**



srisathyasaivachanamrutam

మన మాటలన్నియుకూడను హృదయానందాన్ని అందించేవిగా వుంటుండాలి. ఇతరులనేమాత్రము బాధింపచేసేవిగా వుండకూడదు. ఆ విధమైన మాటలను ప్రవేశపెడితే మనం మనుషలమే కాదు. నీకిష్టములేనప్పుడు యితరులయొక్క చింతన నీవు మానేసెయి. అంతేకాని యిష్టములేనివారిగురించి అధికంగా మాట్లాడటం, పరిహాసించటం, నిందించటం, దూషించటము యివి మహాపాపమని నిరూపిస్తూ వచ్చింది, సామవేదము. మంత్రములు వల్లించినంతమాత్రమున ప్రయోజనము లేదు. నిత్యజీవితములో యేవి అవసరమైన విషయములో అవి మనం వేదములనుండి గ్రహించాలి. మంత్రాలను ఉచ్చరించుకుంటూ, కాలమును వ్యర్థము గావించుకుంటూ, క్రియలో ఆచరణ లేకుండాపోయిన మనము యీ మంత్రములయొక్క ఫలితము నేమాత్రముకూడను అనుభవింపలేము. ఏదో గ్రామఫోను రికార్డులు వాయించినట్లుగా మనం మంత్రములు చెప్పవచ్చును. పవిత్రమైన మానవ జీవితములో భగవంతుని దివ్యవాణిని పవిత్రమార్గములో ప్రవేశపెట్టి జీవితాన్ని ధన్యము గావించుకోవాలి. పవిత్రమైన వేదములలో యే ఒకటిరెండు మాత్రమే ఈనాడు జగత్తులో వ్యాపించి వుంటున్నాయి. వాటి రస స్వరూపమైన సారమును మనము గ్రోలి, తద్వారా క్షీణించుచున్న వేదములను పునరుద్ధరింపచేయటమే మన కర్తవ్యము. దీనికి మనము కంకణము కట్టుకొని సరైన మార్గములో ప్రవేశపెట్టాలి.

**సమత్వమును పెంచుకొనుటయే మానవుని ప్రధానకర్తవ్యము**

మానవ జీవితము ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అనగా దుర్లభమైన మానవజన్మ యెత్తికూడను సత్యవాక్కులను యేమాత్రము శ్రవణముచేయక, విచారణచేయక జీవితము నిరర్ధకం గావించుకోటం సరైన కర్మముకాదు. భగవంతునిపై భక్తిని, విశ్వాసమును మనము అభివృద్ధి పరచుకోవాలి. భక్తి లేకుండిన విద్యలన్నికూడను నిరర్ధకములే! మనము వేదమంత్రములను ఉచ్చరించినంతమాత్రమున ప్రయోజనములేదు. దైవభక్తిని పెంచుకోవాలి. గంట కొట్టినట్లుగా ఉచ్ఛస్వరముతో మంత్రములు పఠించవచ్చు. కాదు, కాదు నాదము రావాలి, ఆ మంత్రములలో నాదమునే

వేదముగా భావించాలి. నాదములో లీనము గావాలి. అదియే మనయొక్క సమాధిస్థితి. ఆ సమత్వాన్ని మనము భావించాలి. సమత్వాన్ని పెంచుకోవాలి. సమత్వాన్ని పంచుకోవాలి. అదియే మానవునియొక్క ప్రధానమైన కర్తవ్యము.

**స్వార్థమును విడిచిపెట్టినపుడే బంధవిమోచనము**

ప్రేమస్వరూపులారా! ప్రధానముగా మానవునిలో వుండవలసినవి రెండు లక్షణములు-భక్తి, త్యాగము. త్యాగములేనిదే భక్తి రాదు. దీనినే 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః' అనింది, వేదము. కాబట్టి, యీ అమృతత్వాన్ని అనుభవించాలంటే త్యాగము, త్యాగము. స్వార్థ, స్వప్రయోజనములు యీ రెండింటిద్వారానే మానవుడు బంధింపబడుతున్నాడు. స్వార్థమును యెప్పుడు నీవు విడచిపెడతావో అప్పుడే బంధము వుండదు. ప్రాణము క్షణభంగురము. కదలిపోయే మేఘములవంటిది. దీని నిమిత్తమై అనేక శ్రమలు పడి దివ్యమైన జీవితాన్ని వ్యర్థముగావించుకోవద్దు. ఏ సేవయందైనాకూడను నీవు త్యాగము పూని, పరులకు సేవ చేసి, సమాజాన్ని మెప్పించి, ఆనందాన్ని అనుభవించాలి. ఎంతకాలమైనా ఉద్యోగము, ఉద్యోగము...ఏమిటీ యోగములేని ఉద్యోగము? ఉద్యోగం చేసుకోవచ్చు. కాని, అవసరమైనప్పుడు వుద్యోగమునైనా త్యాగముచేసి దేశసేవలో మనం పాల్గొనాలి. 'అన్నీ వదలిపెడితే నా సంసారాన్ని చూచే వారెవరు?' అనుకోవచ్చు. అంత విశ్వాసమే లేకపోతే నీ సంసారమెట్లా బాగుపడుతుంది? నారు పోసిన వాడు నీరు పొయ్యడా?

**పుస్తకముల్ పఠించితి పూర్తిగ చూచితి సర్వశాస్త్రముల్**
**నిస్తులమైన విద్యలు నేర్చితినంచును గర్వమేల నీ**
**హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితో కొల్వలేని యీ**
**ప్రస్తుత విద్యలన్నియు నిరర్థకంబులు మానవా!**

**స్వామి కీర్తి, ప్రతిష్ఠలు ఒకరివల్ల వచ్చేవి, పోయేవి కావు**

మన విద్యలుగాని, మన ఆస్తిపాస్తులుగాని భగవత్ విశ్వాసమే లేకపోతే యివన్నియుకూడను నిరర్థకమైపోతాయి. ఎంతటి శ్రీమంతుడైనా దేహమును వదలిపోయే

sri sathyasai vachanamrutam

సమయంలో తనవెంట ఒక పిడికెడు మట్టైనా తీసుకొనిపోవటంలేదు. పోయేవి రెండే రెండు-పుణ్యము, దైవానుగ్రహము. కనుక, ధర్మమును కీర్తిని మనము సాధించాలి. లోకములో జీవనం అస్థిరం. యవ్వనం, ధనము అస్థిరం. ధారాపుత్రులు అస్థిరం. ఇవన్నీ అస్థిరాలే! కీర్తి ఒకరివలన వచ్చేది కాదు. మీరు అనుకోవచ్చును, మావల్లే స్వామికి కీర్తి వచ్చిందని. ఇది చాలా పొరపాటు. స్వామి కీర్తి ఒకరివల్ల వచ్చేది కాదు, ఒకరివలన పోయేటువంటిదికాదు. అది నానుండి వచ్చినదే! నా ఆనందం నానుంచి వచ్చినదే! ఒకరినుండి వచ్చినది కాదు. ప్రతి మానవుడు తన కీర్తి, అపకీర్తులు తన ప్రవర్తనుంచే వచ్చినవి కాని యితరులనుంచి వచ్చినవి కావని గుర్తుంచుకోవాలి. కనుక, సత్ప్రవర్తనను అభివృద్ధిపరచుకొని, సత్సంగములోచేరి, సత్కర్మలు ఆచరించినప్పుడే మనకు సత్కీర్తి లభిస్తుంది. దుస్సంగము, దురాలోచనలు, దుర్భావములు, దుష్కర్మలు ఆచరిస్తుంటే మీకు కీర్తి యెట్లా వస్తుంది? అపకీర్తియే నీయొక్క పట్టము. అందరితో చెడ్డ చెడ్డ అనిపించుకుని బ్రతికేదానికంటె, పది మందితో మంచి అనిపించుకొని చావటమే మంచిది. సర్వత్రవుండిన ప్రణవాకారాన్ని ధరించి ప్రణవశబ్దమునే ఉచ్ఛ్వాసనిశ్వాసములుగా విశ్వసించి అనుభవించే మానవుడు దుర్మార్గములో ప్రవేశించరాదు. సామవేదము ఏమి చెప్పింది? సర్వత్రా నిండినటువంటి పరమాత్ముడు నీయందుకూడను వుంటున్నాడు. శబ్దస్వరూపుడై వుంటున్నాడు. అతను లేని స్థానం లేదు. అతనిది కాని స్థానం లేదు, అని ప్రబోధించింది. ఈ సత్యాన్ని మీరు విశ్వసించి, ప్రణవాన్ని ఉపాసనగా చేసి తద్వారా ప్రణవములో ఐక్యంకావాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 01-10-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam